తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

# అధికారి దృష్టికి చెరువు సమస్య

**-సమస్య తీరే వరకు చేపల వేట నిషేధం**



చిట్వేలి, జులై 31 ప్రభాతవార్త: స్థానిక మండల పరిధి చెర్లోపల్లి గ్రామంలోని ఎల్లమరాజు చెరువు నందు చేపలను పట్టడానికి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతూ మండల పరిధిలోని గిరిజనులు శుక్రవారం జిల్లా మత్స్యశాఖ అధికారి నాగయ్యను కలిశారు. రాష్ట్ర టిడిపి సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ సలహా మేరకు జనసేన రాయలసీమ అధ్యక్షుడు జోగినేని మణి, చిట్వేలి మండల జనసేన నాయకుడు ఆనాల సునీల్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మత్స్యశాఖ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎల్లమరాజు చెరువులో చేపలు పట్టడానికి బెస్తవారి కుటుంబాల పేరుతో ఒకే సహకార సంఘానికి ప్రభుత్వం హక్కులు కల్పించడంతో గిరిజనులమైన మాకు అవకాశం లేదని జీవన వృత్తి అయిన చేపల వేటను కోల్పోతున్నామన్నారు. వాస్తవ హక్కుదారులు చేపలు పట్టడం లేదని, ఇతరులకు కట్టబెట్టారని వారు మాపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. చెరువుకు సమీపంలో వందలాది గిరిజన కుటుంబాలు ఉన్నాయని అధికారులు గుర్తించాలని తెలిపారు. ప్రభుత్వ చట్టం ప్రకారం హెక్టారుకు ఒకరు చొప్పున 400 హెక్టర్ల విస్తీర్ణం కలిగిన ఈ చెరువులో 400 మందికి హక్కు కల్పించవచ్చని తెలిపారు. ఇక్కడ జరుగుతున్న ఇబ్బందులను అధికారులు గుర్తించి వెంటనే అర్హులైన గిరిజనులందరికి సొసైటీలో సభ్యులుగా చేర్చి హక్కును కల్పించాలని మొరపెట్టుకున్నారు.

**సమస్య తీరేవరకు చేపల వేట నిషేధం:**

తదుపరి జిల్లా మత్స్యశాఖ అధికారి నాగయ్య మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి చెరువుపై నెలకొన్న సమస్య మా దృష్టికి వచ్చిందని అన్నారు. ఈ సమస్య పూర్తిస్థాయిలో తీరి అందరికీ న్యాయం జరిగే వరకూ చేపల వేట కొనసాగించేది లేదని తెలిపారు. మండల రెవెన్యూ, పోలీస్, మరియు నీటి పారుదలశాఖలకు నోటీసులు పంపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాదినేని కనక రాజ, మాదినేని రాజా, పగడాల వెంకటేష్, పగడాల శివ, దండు రమేష్, బాధిత గిరిజన కుటుంబీకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా నుండి...

# 1,36,059 పేర్లు తొలగింపు

**-పోలింగ్ స్టేషన్లలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ -ఆగస్టు 30వ తేదీ వరకు క్లైములు, అభ్యంతరాలు స్వీకరణ -అక్టోబర్ 3కు తుది ఓటర్ల జాబితా ప్రచురణ**



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న డిఆర్ఓ

చిత్తూరు, జులై 31 ప్రభాతవార్త: జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ)-2026 చేపట్టి పూర్తయిన అనంతరం ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 1,36,059 మంది ఓటర్ల పేర్లు మాయం అయ్యాయి. పోలింగ్ స్టేషన్లలో బూత్ లెవల్ ఆఫీసర్లు శుక్రవారం ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు. జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో 13,40,126 మంది ఓటర్లు వుండగా అందులో 12,04,067 మంది ఓటర్ల వివరాలు డిజిటలైజ్ అయ్యాయి. మిగిలిన 1,36,059 మంది ఓటర్ల వివరాలు సరిపోకపోవడంతో ముసాయిదా ఓటర్ల జాబితాలో వారి పేర్లను డిజిటలైజ్ చేయలేదు. మిగిలిన ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేయడానికి ప్రజల నుండి శుక్రవారం నుండి ఆగస్టు 30వ తేదీ వరకు క్లైయిములు, అభ్యంతరాలు స్వీకరించ నున్నారు. ఇలా స్వీకరించిన క్లైములు, అభ్యంతరాలపై సెప్టెంబర్ 28వ తేదీలోపు విచారణ పూర్తి చేసి అక్టోబర్ 3వ తేదీ ఓటర్ల తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఓటర్ల ముసా యిదా జాబితా విడుదల కావడంతో ఇందులో 1,36,059 మంది ఓటర్ల పేర్లు గల్లంతు అయ్యాయి. అలాగే జిల్లాలో గడువు ముగిసే నాటికి మ్యాపింగ్ చేసుకోకుండా 23,881 మంది ఓటర్లు వున్నారు. వీరికి శుక్రవారం నుండి నోటీసులు జారీ చేయనున్నారు. అలాగే జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల్లో తల్లిదండ్రుల పేర్లు, చిరునామా, వయస్సు వ్యత్యాసం తదితర లాజికల్ ఎర్రర్ అనాలసిస్(తార్కిక దోషాలు) కలిగి వున్న 1,10,205 మంది ఓటర్లకు సైతం నోటీసులు పంపనున్నారు. ఇలా 11 రకాల దోషాలు వుండి ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు రాకపోయిన ఓటర్ల ఇంటికి బిఎల్ఓలు నాలుగోసారి వెళ్ళనున్నారు. బిఎల్ఓలు వెళ్ళిన సమయంలో ఓటర్లు తగిన రుజువులు చూపించి పత్రాలు సమర్పిస్తే ఆ పత్రాలను స్వీకరించి బిఎన్ఓలు మరోసారి తుది ఓటర్ల జాబితాలో పేరు వుండేలా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో మొత్తం 13,40,126 మంది ఓటర్లు వుండగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం అనంతరం 12,04,067 ఓటర్ల పేర్లు డిజిటలైజ్ అయ్యాయి. ఇందులో నగరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,03,693 మంది ఓటర్లు వుండగా 1,82,814 మంది ఓటర్ల పేర్లు డిజిటలైజ్ అయ్యాయి. అలాగే జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,07,342 ఓటర్లు వుండగా 1,92,718 మంది ఓటర్ల పేర్లు డిజిటలైజ్ అయ్యాయి. అలాగే చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,03,536 మంది ఓటర్లు వుండగా ఇందులో 1,77,100 ఓటర్ల పేర్లు డిజిటలైజ్ అయ్యాయి. అలాగే పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,22,755 మంది ఓటర్లు వుండగా ఇందులో 2,02,434 మంది ఓటర్ల పేర్లు డిజిటలైజ్ అయ్యాయి. అలాగే పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,72,326 ఓటర్లు వుండగా ఇందులో 2,42,945 మంది ఓటర్ల పేర్లు డిజిటలైజ్ అయ్యాయి. అలాగే కుప్పం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,30,474 ఓటర్లు వుండగా ఇందులో 2,06,056 మంది ఓటర్ల పేర్లు డిజిటలైజ్ అయ్యాయి.

**పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి తొలి అడుగు పూర్తి:**

**- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో డిఆర్ఓ**

పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనలో తొలి అడుగు పూర్తయ్యిందని, శుక్రవారం పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డిఆర్ఓ మోహన్‌కుమార్ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలను సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో శుక్రవారం ప్రచురించినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 13,40,126 ఓటర్లు వుండగా ఇందులో 12,04,067 మంది ఓటర్ల వివరాలు డిజిటలైజ్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన అర్హులైన ఓటర్లను సైతం తప్పనిసరిగా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చూసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా మరింత కచ్చితంగా వుండేందుకు ప్రజల భాగస్వామ్యంతో పాటు రాజకీయ పార్టీల సహకారం కీలకమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో రాజకీయ పార్టీ, ఎన్నికల యంత్రాంగం పరస్పర సమన్వయంతో పని చేయడం ఎంతో అవసరం అన్నారు. ప్రజల నుండి శుక్రవారం నుండి ఆగస్టు 30వ తేదీ వరకు క్లైయిములు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, వాటిపై సెప్టెంబర్ 29లోపు విచారణ పూర్తి చేసి అక్టోబర్ 3వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బిఎస్‌పి నుండి బి.లోకనాథం, బిజెపి నుండి అట్లూరి శ్రీనివాసులు, తెలుగుదేశం నుండి వెంకిటీల సురేంద్రకుమార్, వైఎస్ఆర్‌సిపి నుండి విజయసింహారెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల డిటి రాజేంద్రన్, తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ కుర్చీపై...

# సమర్థనాయకుడు అవసరం

**-నోటిఫికేషన్ ముందే నగర ప్రజల వాడివేడిగా చర్చ**





ప్రభాతవార్త-తిరుపతి:

ప్రపంచ ప్రసిద్ధగాంచిన ఆధ్యాత్మిక నగరం తిరుపతికి ఇప్పుడు సమర్ధనాయకుడు అవసరమంటూ నగరవాసులు అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు. ఆధ్యాత్మికత, విశ్వాసం, సంస్కృతి, పర్యాటకం, వాణిజ్యం కలగలిసిన ఈ నగరం అభివృద్ధిలో కొత్త దశకు చేరుకోవాల్సిన అవసరం ఉంది. నగరంలో ప్రజలకు భద్రత, న్యాయం, పారదర్శక పరిపాలన, అవినీతి రహిత వ్యవస్థ అవసరమని మేధా వులు చెబుతున్నారు. ముఖ్యంగా భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు, రౌడీయిజం, రాజకీయ ఒత్తిళ్లు వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు ధైర్యం, నిజాయితీ, దూరదృష్టి కలిగిన బలమైన నాయకత్వం అవసరమనే వాదనలు వినిపిస్తున్నారు. తిరుపతి నగరానికి గ్రేటర్ తిరుపతి నగరపాలకకు మేయర్‌గా మంచి నాయకుడు రావాలన్నది అత్యంత కీలకమైన అంశంగా జనం చర్చించుకుంటున్నారు. భూ మాఫియా, రౌడీ మూకలు, రాజకీయ ఒత్తిళ్లకు లొంగని వ్యక్తిత్వం కలిగిన మేయర్ అవసరమనే చర్చ హాట్‌టాఫిక్‌గా మారింది. భూ ఆక్రమణలపై ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని అంటున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ జరిపి, ఆక్రమణ నిజమైతే కఠిన చర్యలు తీసుకునే విధానం త్వరలో తిరుపతి నగరపాలకసంస్థలో రావాలని, భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు, రౌడీయిజం, అవినీతి, మున్సిపల్ సమస్యలపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసే ప్రత్యేక హెల్ప్‌లైన్, ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సామాన్య ప్రజలు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు, యాత్రికులు ఎలాంటి భయం లేకుండా నగరంలో సంచరించే పరిస్థితి కల్పించాలి. తిరుపతి నగరంలో పారిశుద్ధం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, ట్రాఫిక్, పార్కింగ్, వ్యర్థాల నిర్వహణ వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపాలని, యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని, నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయాలు, పాదచారుల భద్రత, రహదారి అభివృద్ధి, ప్రజా రవాణా వ్యవస్థలను మెరుగు పరచాలని జనం కోరుతున్నారు. కార్పొరేటర్ల ఎంపికలో కూడా ఉన్నత విద్యావంతులు, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్నవాళ్ళు, నాయకత్వ లక్షణాలు కలిగినవారు, ప్రజలతో మమేకమయ్యే వ్యక్తులను ఎన్నుకోవాలని చెబుతున్నారు. ఆధునిక సదుపాయాలతో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించే మేయర్‌నే ప్రజలు కోరుకుంటున్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు...

# తిరుపతిలో విస్తృత ఏర్పాట్లు

**-భక్తులకు అసౌకర్యం కలగకుండా సమన్వయ సేవలు**
**-టిటిడి జెఈఓ డాక్టర్ శరత్**



టిటిడి జెఈఓ డాక్టర్ ఎ.శరత్ అధికారుతో సమావేశం

తిరుమల, జులై 31ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, నవరాత్రి బ్రహ్మోత్సవాలు, పెరటాసి శనివారాల సందర్భంగా అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని టిటిడి జెఈఓ డాక్టర్ ఎ.శరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిరుపతిలో టిటిడి పరిపాలన భవనంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. భక్తుల వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల్లో తగిన పార్కింగ్ స్థలాలు సిద్ధం చేయాలని, వివిధ ప్రాంతాల్లో హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించాలని సూచించారు. పార్కింగ్, హోల్డింగ్ పాయింట్ల వద్ద తగిన సంఖ్యలో మొబైల్ మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాలు కల్పించి పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లు, రహదారులు, భక్తులు అధికంగా సంచరించే ప్రాంతాల్లో స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ముఖ్య ప్రాంతాల్లో క్యూ ఆర్ కోడ్‌లతో కూడిన సూచిక బోర్డులు ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైన సమాచారం సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. స్థానిక ఆలయాలు, ప్రధాన భవనాలు, ప్రధాన రహదారులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజా సంబంధాల విభాగం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, అలిపిరి బస్టాండ్, అలిపిరి నడక మార్గం, విష్ణునివాసం, శ్రీనివాసం తదితర ప్రాంతాల్లో అదనపు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహతి కళాక్షేత్రం, రామచంద్ర పుష్కరిణి, అన్నమాచార్య ప్రాజెక్టులో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. భక్తులకు అవసరమైన ప్రాంతాల్లో శ్రీవారి సేవకులను నియమించి సేవలను మరింత విస్తృతంగా అందించాలని టిటిడి సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవిని ఆదేశించారు. శ్రీవారి వార్షిక, నవరాత్రి బ్రహ్మోత్సవాలు, పెరటాసి శనివారాల్లో అధిక భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇంజినీరింగ్‌శాఖతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి భక్తులకు అత్యుత్తమ సేవలు అందించాలని జెఈఓ సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఈలు మనోహరం, వెంకటేశ్వర్లు, డిఈలు రవిశంకర్ రెడ్డి, సరస్వతి, సిపిఆర్ఓ తలారి రవి, అదనపు ఆరోగ్య అధికారి డాక్టర్ సునీల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాంగ్ కాల్‌తో...

# పరిచయం!

**-ఆపై ప్రేమ, ఇంటి నుంచి అదృశ్యం**
**-భర్త..పిల్లల్ని వదిలి యువకుడ్ని పెళ్లాడిన వివాహిత**
**-పోలీసులకు అప్పగింత**
**-విడాకులకై న్యాయవాదుల్ని ఆశ్రయించిన భర్త**

కుప్పం, జులై 31 ప్రభాతవార్త : ఆమెకు పెళ్లై పద్దెనిమిది ఏళ్లుగడుస్తున్నాయి, భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడు నెలల క్రితం ఓ రాంగ్ కాల్ రావడం దానికి ఆమె స్పందించి కాల్ చేసిన యువకుడితో పరిచయం, ప్రేమ చివరకు పెళ్లిదాకా వ్యవహారం వెళ్లింది. భర్త, పిల్లలను వదిలేసి అదృశ్యమైన ఆ వివాహిత తన ప్రియుడ్ని పెళ్లి చేసుకుంది. విషయం తెలుసుకున్న భర్త గ్రామస్తుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి పోలీసులకు అప్పగించారు. ఈ స ంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. గుడుపల్లె మండలం గుడికొత్తూరు గ్రామంకు చెందిన చిరంజీవికి శాంతిపురం మండలం గొల్లపల్లి గ్రామంకు చెందిన శోభతో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ఇదిలా ఉండగా మూడు నెలల క్రితం శోభకు ఓ రాంగ్ కాల్ వచ్చింది. దీంతో ఆమె రెస్పాన్స్ కావడంతో గుంటూరు జిల్లా కంద్రిగ గ్రామంకు చెందిన బాలాజీ నాయక్ (22)తో పరిచయం ఏర ్పడింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్యా ఫోన్ కాల్స్ పెరిగి ఈ వ్యవహారం ప్రేమ వరకు దారి తీసింది. ఇద్దరం కలసి పెళ్లి చేసుకుందామని శోభ బాలాజీనాయక్‌తో పేర్కొంది. దీంతో నెలరోజుల క్రితం శోభ తన భర్త ఇంటినుంచి అదృశ్యమైంది. ఈ వ్యవహారంగా భర్త చిరంజీవి గుడుపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే నాలుగు రోజుల క్రితం శోభ, బాలాజీనాయక్ కుప్పం వచ్చి స్థానికంగా ఉన్న అమ్మవారి ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. బెగ్గిలపల్లి గ్రామంలో వీరు ఓ ఇంట్లో ఉన్న విషయం తెలుసుకున్న భర్త చిరంజీవి గ్రామస్తులతో కలసి బెగ్గిలపల్లికి చేరుకున్నాడు. అక్కడ శోభ, బాలాజీ నాయక్ పట్టుబడ్డారు. దీంతో గ్రామస్తులు ఈ వ ్యవహారంపై పంచాయతీ నిర్వహించారు.



గ్రామస్తుల పంచాయితీలో ఉన్న శోభ, బాలాజీ నాయక్

కాగా శోభ మాట్లాడుతూ తాను ఫోన్‌లో మాట్లాడుతుంటే తన భర్త అనుమానాలు వ్యక్తం చేసేవాడని కొట్టేవాడని పేర్కొంది. మరో పక్క బాలాజీ నాయక్ కుప్పం వచ్చి తనను పెళ్లి చేసుకోకుంటే చనిపోతానని శోభ పేర్కొనేదని చెప్పాడు. చివరకు గ్రామస్తులు శోభ, బాలాజీ నాయక్‌ను గుడుపల్లె పోలీసులకు అప్పగించారు. శోభ భర్త చిరంజీవి విడాకులు పొందేందుకు న్యాయవాదులను ఆశ్రయించినట్లు సమాచారం. కాగా శోభకు వయసు 37 సంవత్సరాలు ఉండగా బాలాజీనాయక్‌కు 22 ఏళ్ల వయసు అని తెలిసింది.

# శ్రీకాళహస్తి నియోజకవర్గ ఓటర్లు 2.16లక్షలు

**పురుషుల కన్నా మహిళలే అధికం: ఆర్‌డిఓ**



ఆర్డీఓ భాను ప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జులై 31 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తరువాత మిగిలిన ఓటర్ల సంఖ్యను ప్రకటించినట్లు శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జూన్ 15 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు, ఇంటింటికి వెళ్ళి ఓటర్లను ప్రత్యేక్షంగా కలుసుకొని ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించి డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. ఈ మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లుగ తంలో 2లక్షల 46వేలు ఉండగా కొత్త జాబితా ప్రకారం 2లక్షల 16వేల 287 ఓట్లుగా స్పష్టమైనట్లు తెలిపారు. ఇందులో పురుషులు 1,04,158 మహిళలు1,12,121 మంది అంటే పురుష ఓటర్లు కన్నా మహిళలు సుమారు 8వేలు అధికంగా ఉన్నాయి. శ్రీకాళహస్తి మండలంలోని 62పోలింగ్ బూత్‌లలో పురుషులు 19838 మంది మహిళలు 20781 వెరసి 40,619 మంది, శ్రీకాళహస్తిమున్సిపాలిటిలో 74 పోలింగ్‌స్టేషన్లలో పురుషులు 24,399 మంది మహిళలు 26,956 ఇతరులు 4 వెరసి 51359 మంది, రేణిగుంట లోని 80 పోలింగ్ కేంద్రాల్లో పురుషులు 25,604, మహిళలు 27,939 ఇతరులు 3 వెరసి 53,546 మంది, ఏర్పేడు మండలంలోని 56 పోలింగ్‌బూత్‌లలో పురుషులు 19577 మంది మహిళలు 20,719 మంది ఇతరులు 1 వెరసి 40,297, తొట్టంబేడులో 47 పోలింగ్ బూత్‌లలో పురుషులు 14,740 మహిళలు 15,726 వెరసి 30,466 ఉన్నారని వివరించారు. ఈ మేరకు బూత్ వారిగాకూడా ప్రకటించారు. నియోజకవర్గంలో 319 పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి వివరించారు.

# పోలీసులకు ఘన సత్కారం

**- తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు**





పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సన్మానిస్తున్న ఎస్‌పి



తిరుపతి క్రైమ్, జులై 31 ప్రభాతవార్త : సుదీర్ఘ కాలం పాటు తిరుపతి జిల్లాలో పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ శుక్రవారం పదవి విరమణ పొందిన పోలీసులను తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసారు. అనంతరం వారి సేవలను అభినందించారు. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, అది ప్రజల ప్రాణాలు, ఆస్తులు, శాంతి భద్రతల పరిరక్షణ కోసం 24 గంటలూ అంకితభావంతో నిర్వర్తించే మహత్తర బాధ్యత అని పేర్కొన్నారు. అలాంటి బాధ్యతాయుతమైన ఉద్యోగంలో మూడు, నాలుగు దశాబ్దాలకు పైగా ఎలాంటి మచ్చ లేకుండా నిజాయితీతో సేవలందించి గౌరవప్రదంగా పదవీ విరమణ పొందడం ప్రతి పోలీస్ అధికారికి గర్వకారణమని కొనియాడారు. పోలీస్ అధికారుల విజయవంతమైన సేవా ప్రయాణంలో వారి కుటుంబ సభ్యుల సహకారం, త్యాగాలు అమూల్యమైనవని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ శాఖ, రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. నేడు పదవి విరమణ పొందిన డీఎస్పీ శ్యామ్ సుందరం సిసిఎస్ తిరుపతి 44 సంవత్సరాల సేవలు, ఏఎస్ఐ దయానిధి నాయుడు (ఈస్ట్ పీఎస్./ఎస్‌బీ) 43 సంవత్సరాల, ఎస్ఐ బాలాజీ (ట్రాఫిక్, తిరుపతి) - 40 సంవత్సరాల సేవలు, హెడ్ కానిస్టేబుల్ ఆరుముగం (మహిళా పోలీస్ స్టేషన్) - 36 సంవత్సరాల సేవలు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీనివాసులు, రవి మనోహర్ ఆచారి రామకృష్ణ, శ్రీనివాసరావు, ఎస్‌బి డి.ఎస్.పి గీతాకుమారి, ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు సోము, శంకర్ రెడ్డి, శేఖర్, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విషం తాగి...సాఫ్ట్‌వేర్ మహిళా ఉద్యోగి ఆత్మహత్య!

**- కుప్పం రైల్వేస్టేషన్‌లో ఘటన, మృతురాలిది నెల్లూరు జిల్లా**

**- బెంగళూరులో ఉద్యోగం, అప్పుల ఒత్తిడులు**



విష ం తాగి ఆత ్మహత్య చేసుకున్న రాధ

కుప్పం, జులై 31 ప్రభాతవార్త: నెలకు రెండు లక్షలు దాకా వేతనం తీసుకుంటున్న ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చేసిన అప్పులు, ఒత్తిళ్లు తాళలేక విషయం తీసుకుని ఆత ్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం కుప్పం రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం అడుపుపల్లికి చెందిన చీర్ల రాధ(37) రవి భార్యభర్తలు. వీరు బెంగళూరు నగరంలోని కెఆర్ పురంలో నివాస ం ఉ ంటున్నారు. వీరికి ఎనిమిది, నాలుగేళ్ల వయసు గల ఇద్దరు కుమారులు సంతానం. చీర్ల రాధ బెంగళూరులోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసేది. రెండు లక్షల దాకా వేతనం తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో బెంగళూరులో అపార్ట్‌మెంట్, భూమి కొనుగోలు చేసేందుకు అప్పులు సైతం చేసిందన్నారు. మరో పక్క ఉద్యోగంలో సైతం ఒత్తిడి అధికంగా ఉండేది. ఓ పక్క అప్పుల బాధ, మరో పక్క మానసిక ఒత్తిడికి లోనైన రాధ తన సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసుకుని భర్త నెంబరు పేపర్‌లో రాసుకుని కుప్పం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఫ్లాట్‌ఫామ్‌నెం1లో కూర్చుని ఉన్న రాధ ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు వచ్చి చూడగా అప్పటికే రాధ ప్రాణాలు కోల్పోయింది. ఈమె విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే ఆమె చేతిలోని భర్త ఫోన్‌నెంబరుకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

# సమస్యలను స్వాములే పరిష్కరించుకుంటాం

**- శ్రీనివాసనంద సరస్వతి స్వామి**

తిరుపతి హెల్త్, జూలై 31 ప్రభాతవార్త: శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసనంద సరస్వతి స్వామి మాట్లాడుతూ వేదాశ్రమంలో చిన్న చిన్న తప్పులు జరిగి ఉంటాయని, వేదాశ్రమ పరిరక్షణ సమితి, పూర్వ విద్యార్థులుతో కలిపి దక్షిణ భారతదేశ సాధు సంతులతో, విశ్వహిందూ పరిషత్, హిందూ ధార్మిక సంస్థలతో కలిపి త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకొని, చర్చించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆశ్రమంలో రాజకీయ జోక్యం వద్దు అని కోరారు. ఏర్పేడు ఆశ్రమం హిందూ సనాతన ధర్మానికి కేంద్రబిందువుగా, గుండెచప్పుడుగా ఉన్నదని పేర్కొన్నారు. ఏపీ సాధు పరిషత్ గౌరవ అధ్యక్షులు అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే అతి ప్రాచీనమైన ఆశ్రమం ఏర్పేడు వేదాశ్రమ మని, అక్కడ జరుగుతున్న అవినీతి ఆరోపణలతో మన ఆశ్రమాత్రమాన్ని మనమే కించపరచుకోవడం అన్నారు. ఆశ్రమ పరిరక్షణ సమితి, పూర్వ విద్యార్థులు కలిసి కూటమి ప్రభుత్వం దృష్టికి కానీ, ఎండోమెంట్ మినిస్టర్ ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి కానీ, సిబిఐ ఎంక్వయిరీ, సిట్ వేయించడం వంటి కార్యక్రమం చేపట్టాలని, వ్యవస్థలపైన అనవసరమైన మాటలు వద్దు అని అన్నారు. ఏర్పేడు వేదాశ్రమమని, 100 సంవత్సరాల చరిత్ర కలిగి శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న దని అన్నారు. గతంలో ఆశ్రమం పైన నిరసనకు పిలుపునిచ్చి ఏపీ సాధు పరిషత్ సలహా మేరకు నిరసనను విరమించుకున్నానని తెలిపారు.

## తప్పిన ఓటర్లు దరఖాస్తులు చేసుకోవచ్చు

**- ఓటర్ల నమోదు అధికారి భరత్ నాయక్**



వెంకటగిరి, జూలై 31 ప్రభాతవార్త: సర్ ప్రక్రియలో భాగంగా తప్పిపోయిన ఓటర్లు ఆగస్టు నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి భరత్ నాయక్ తెలిపారు. వెంకటగిరి తాసిల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 6 ఏ ఫామ్ ను బి ఎల్ వో లకు ఇచ్చి కొత్తగా ఓటర్ చేరవచ్చు అని తెలిపారు. ఎవరు ఓటును విచారించకుండా తొలగించమని, కొత్తవారిని చేర్చుకునేది కూడా విచారించే చేర్చుకుంటామని తెలిపారు. ఈ అవకాశాన్ని మిస్ అయిన ఓటర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో సర్ ప్రక్రియ విజయవంతంగా జరిగినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 2,09,276 మంది ఓటర్‌లో ఉన్నట్లు తెలిపారు. పురుషులు లక్ష 28 వేల 78 మంది, స్త్రీలు లక్ష 63 వేల 94 మంది ఉన్నట్లు తెలిపారు. 324 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. ఈ సమావేశంలో తాసిల్దార్ పి శిరీష, మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్ పాల్గొన్నారు.

## కారు ఢీకొని...కార్మికులు మృతి!

తడ, జూలై 31 ప్రభాతవార్త: తడ మండలం కొండూరు గ్రామం వద్ద ఎన్ హెచ్ 16 రోడ్డు దాటుతుండగా శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఐదు మంది నిర్మాణ భవన కార్మికులు పనుల నిమిత్తం కొండూరు మధుకాన్ లేఅవుట్ నందు ఐదు రోజుల నుండి నివాసం ఉంటున్నారు శుక్రవారం ఉదయం అర్జున్ బటారా, చైతు గౌడ్ రోడ్డు దాటుతున్న క్రమంలో సూళ్లూరుపేట నుండి చెన్నై వైపు వెళ్లే కారు అతివేగంగా వచ్చి భవన కార్మికులను ఢీకొనడంతో బలమైన గాయాలు కావడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రమైన గాయాలతో హాస్పిటల్ కు తరలించగా కొద్దిసేపటికే మృతి చెందారు తడ ఎస్సై కొండప్ప నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరోగ్యం కోసం క్రీడలో ఎంతగానో ఉపయోగపడతాయి

**- కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్**



వెంకటగిరి, జూలై 31 ప్రభాతవార్త : ఆరోగ్య కోసం క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తొమ్మిదవ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్ తెలిపారు. మండలంలోని వల్లివేడు గ్రామ సమీపంలో ఉన్న తొమ్మిదవ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో మూడు రోజులు పాటు సిబ్బందికి జరిగిన ఆటల పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన విజేతలకు బహుమతులను అందజేశారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లో కూడా సిబ్బంది పాల్గొనాలని సూచించారు. విధి నిర్వహణలో మానసికంగా శారీరకంగా అలసిపోయినప్పుడు ఈ క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. సిబ్బంది ఆరోగ్యం కోసం వార్షిక క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది కుటుంబ సభ్యులకు కూడా ఆటలు పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారిని అభినందించి బహుమతులు అందజేశారు.

## నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ : ఎంపీడీవో

బాలాయపల్లి, జూలై 31 ప్రభాతవార్త : మండలంలోని 5083 మందికి ఆగస్ట్ నెల ఒకటో తేదీ రెండు కోట్ల 23 లక్షల రూపాయల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తాము అని ఎంపీడీవో దాసరి నారాయణ తెలిపారు. ఉదయం 6 గంటల నుండి ఇంటింటికి వెళ్లి సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పంపిణీ చేస్తారు అని చెప్పారు. లబ్ధిదారులందరూ ఇంటి వద్ద ఉండి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ తీసుకోవాలని కోరారు.

**శివయ్య హుండీల్లో...**

## రూ.1.2కోట్లు నగదు, 321 కిలోల వెండి



శ్రీకాళహస్తి,జూలై 31 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని స్వామి అమ్మవార్లు, పరివార దేవతల హుండీల్లో భక్తులు 15రోజుల పాటు సమర్పించిన కానుకలను శుక్రవారం మందుకొట్టు మండపంలో లెక్కించారు. ఆలయ ఇఓ బికె వెంకటేశులు,ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ పర్యవేక్షణలో లెక్కించారు. భక్తులు హుండీల్లో సమంర్పించిన నగదు,చిల్లర నాణెములు రూ.1,20,78,414లు రాగా నాగపడగల రూపంలో వెండి 321కిలోల 50 గ్రాములు వచ్చినట్లు ఇఓ బికె వెంకటేశులు మీడియాకు వివరించారు. కాగా 29 గ్రాముల 500 మిల్లిల బంగారు వచ్చిందని తెలిపారు.83 విదేశీ కరెన్సినోట్లు వచ్చినట్లు వివరించారు.గతంలో ఇక్కడ హుండీల లెక్కింపు నెలకు 35రోజులకు చేపట్టేవారు.దేవాదాయశాఖ 15రోజుల కొకమారు లెక్కింపు చేయాలని సూచించినా ఇక్కడ అమలు జరిగేది కాదు.కానీ ఇటీవల హుండీలు నిండి దొంగలు చేతులేసి దొంగలించారు. అప్పటి నుంచి ఆలయ ఇఓ వెంకటేశులు పారదర్శకతతో 15రోజల కొక మారు లెక్కింపు చేపడుతున్నారు.ఈ నేపథ్యంలోశుక్రవారం లెక్కింపుల్లో ఛైర్మెన్ఇఓలతో పాటు బోర్డు సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,ఇఇ శ్రీనివాసులురాజు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ భూముల వివాదం పరిష్కరిస్తాం

**- కడ పి.డి. వికాస్ మర్మత్**



శాంతిపురం, జూలై 31 ప్రభాతవార్త : మండలంలోని గుండిశెట్టిపల్లి వద్ద కురబ కులస్తులకు చెందిన ఆలయ భూముల వివాదాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపడ్తామని కడ పి.డి. వికాస్ మర్మత్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన క్షేత్ర స్థాయిలో ఆలయ భూములను పరిశీలి ంచారు. భూవివాదంకు సంబంధించి ఇరుపక్షాల వారితో మాట్లాడి సమస్యను పూర్తిగా తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరలోనే సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సిఎం పిఎ శ్రీకాంత్, ఆర్డీఒ షేక్ మహ్మద్ హుసేన్, తహశీల్దార్ తనూజ, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్, నేతలు జనార్ధనరెడ్డి, మణి, గిరిప్రసాద్, మంజునాథ్, గోవిందరాజులు, సింగిరి శ్రీనివాసులు, కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్ పాల్గొన్నారు. అనంతరం పి.డి. తుమ్మిశి చెరువు వద్ద చేపడుతున్న సుందరీకరణ పనుల్ని పరిశీలించారు. పిల్లల పార్కు, ఓపెన్ జిమ్ పరికరాల ఏర్పాటు పనుల్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## బూత్ బలోపేతమే... బీజేపీ విజయానికి బలమైన పునాది



శ్రీకాళహస్తి జూలై 31 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర, జిల్లా నేతలు, శ్రీకాళహస్తి నియోజకవర్గం బిఎల్ఏ 2ల సమావేశం అసెంబ్లీ కన్వీనర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ అధ్యక్షతన పోలింగ్ బూత్ స్థాయి సంస్థాగత బలోపేతంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షిస్తూ, ప్రతి బూత్‌ను మరింత బలోపేతం చేయడం, ప్రతి ఓటరిని చేరుకోవడం, గ్రామ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని విస్తరించడం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని లక్ష్యంగా చేసుకుని కార్యాచరణ రూపొందించాలని పార్టీ శ్రేణులకు నాయకులు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో బీజేపీ జాతీయ జాతీయ కార్యదర్శి శ్రీ ఋతురాజ్ సిన్హా గారు, అసెంబ్లీ కన్వీనర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధానకార్యదర్శిలు నాగోతు రమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, మాజీ ఎంపీ వర ప్రసాద్ రావు, తిరుపతి జిల్లా ఇంచార్జి పులి వెంకట కృష్ణా రెడ్డి, అనంతపురం జిల్లా ఇంచార్జి చంద్రప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధు సూదన్, కార్యదర్శి మేకల హనుమంత్ రావు, జిల్లా ప్రధానకార్యదర్శిలు కె.నరేష్, మునికృష్ణయ్య, ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, మండల అధ్యక్షులు పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, వేదం కృష్ణయ్య, నరేష్, కోలా గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కెఇసి, సిఎస్ఇ మధ్య అవగాహన ఒప్పందం




కుప్పం, జూలై 31 ప్రభాతవార్త: విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచే లక్ష్యంతో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సీస్ (సిఎస్‌సి) సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కాలేజ్ వైస్‌ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ తెలిపారు. విద్యార్థులకు పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు అలవర్చుకోవడం అత్యంత అవసరం అన్నారు. పరిశ్రమ- విద్యా సంస్థల భాగస్వామ్యంతో విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, సర్టిఫికేషన్ కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిరంతర కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు, సిఎస్‌సి ప్రతినిధి రామ్మోహన్‌రావు, హెచ్ఓడిలు పాల్గొన్నారు.

## ఓట్ల కోసం రాలేదు... ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి



తొట్టంబేడు,జూలై 31 ప్రభాతవార్త: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాము. ప్రజలు ఇంకా ఏం కోరుకుంటున్నారో క్షేత్ర స్థాయి లో ఇంటింటికి వెళ్ళి ప్రజల్ని కలుసుకోమని ముఖ్యమంత్రి, తెలుగు దేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రస్తుతం తాము ఓట్ల కోసం రాలేదని, మీ క్షేమ సమాచారం కోసం వచ్చాను అని శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మారుమూల గ్రామమైన మామిడి గుంటలో పర్యటించారు. ఇంటింటికి వెళ్ళి రాష్ట్రంలో చేపట్టిన సూపర్‌సిక్స్ గురించి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధికి సంబంధించి ప్రత్యేకించి తొట్టంబేడు మండలానికి అందిస్తున్న ఆర్థిక సహాయాలతో ముద్రించిన కర పత్రాలను ఎంఎల్ఏ ఇంటింటికి వెళ్ళి అందిస్తూ వారితో మమేకమౌతూ సమస్యలు అడిగి తెలుసుకుంటూ గ్రామమంతా కలియ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో వివరిస్తూ ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేవు. తాముఓట్లు అడగటానికి రాలేవు. కానీ రెండేళ్ళ క్రితం ఓట్ల కోసం వచ్చినపుడు తాము ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాము. ఆ సమాచారాన్ని ప్రజలకు వివరించటానికి వచ్చామని వివరిస్తూ పర్యటించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రావవిళ్ళ మునిరాజానాయుడు,మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## నేడు మృత్యుంజయస్వామికి అభిషేకాలు



శ్రీకాళహస్తి,జూలై 31 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వర్షాల కోసం మృత్యుంజయస్వామి ఆలయంలో సహస్రఘట్టాభిషేకం నిర్వహించటం ఆనవాయితి. అలాగే ఎవరైనా మృత్యువుతో పోరాడుతున్న వారికి ఉపశమనం కోసం అభిషేకాలు, హోమాలు నిర్వహించటం జరుగుతుంది. వర్షాల కోసం సుమారు 12 సంవత్సరాల తరువాత మృత్యుంజయునికి అభిషేకాలు నిర్వహించటం జరుగుతుంది. 2015 జూలై 28న ఘట్టాభిషేకం నిర్వహించినట్లు ఆలయ రికార్డులు చెబుతున్నాయి. దుర్భిక్ష పరిస్థితి నుంచి కాపాడు పరమేశ్వరా! అంటూ పూజలు,అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి.

**అభిషేకాలకు సన్నాహాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం నిర్వహించే సహస్ర ఘట్టాభిషేకానికి ఏర్పాట్లు చేపట్టారు. ఈ మేరకు ఆలయ అర్చకులు,వేదపండితుల సూచనలతో మృత్యుంజయస్వామి ఆలయం వద్ద చేయాల్సిన కార్యక్రమాలను చేపట్టారు. సాధారణంగా ఈ అభిషేకాలకు సంబంధించి ఆలయ ద్వారం వద్ద గోడ నిర్మిస్తారు. శనివారం అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఆలయానికి ముందు గోడ నిర్మించారు. సుమారు 8 అడుగుల ఎత్తు కల్గిన శివలింగానికి అభిషేకించుటకు రుత్వికులు 1008 మట్టి కుండలతో స్వర్ణముఖి నదీ నుంచి మోక్ష గోపురం లోంచి నీటిని తెచ్చి లింగం మునిగే వరకు నింపుతారు.ఈ మేరకు ఆలయ నిర్మాణం సమయంలోనే రూపకల్పన చేసారు.శనివారం జరిగే కార్యక్రమాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.ముందు శాస్త్రోక్తంగా పూజలు జరుపుతారు.తరువాత మట్టి కుండలతోనీటిని తెచ్చి నింపుతారు. ఒక రోజూ అలాగే ఉంచుతారు. మట్టి గోడ కరిగే కొద్ది మబ్బులు వర్షంగా కురుస్తుందనే నమ్మకం ఉంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసారు.

## విద్యార్థుల ఆరోగ్యంతో...రాజీ వద్దు!

**- కమిటీ ముందు ఏఎస్ఎఫ్ డిమాండ్**



తిరుపతి హెల్త్, జూలై 31 ప్రభాతవార్త: స్విమ్స్ లో ఇటీవల చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటనపై ప్రభుత్వం నియ మించిన విచారణ కమిటీ ముందు ఆంధ్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఎస్ఎఫ్) ప్రతినిధి బృందం విద్యార్థుల తరఫున హాజరై పలు కీలక అంశాలను ప్రస్తావించింది. ప్రభుత్వం ఆహ్వానం మేరకు కమిటీ సమావేశానికి హాజరైన ప్రతినిధులు, ఘటనకు దారితీసిన పరిస్థితులు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఏఎస్ఎఫ్ కమిటీ సభ్యుడు గార్లపాటి శ్రీధర్ మాట్లాడుతూ స్విమ్స్ హాస్టళ్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, వంటశాల నిర్వహణలో లోపాలపై విద్యార్థులు చాలా కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్లే ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించేలా కఠిన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఆహార భద్రత ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యానికి భంగం కలిగే విధంగా వ్యవహరించిన బాధ్యులపై విచారణ పూర్తయ్యాక కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రభుత్వం రాజీపడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం, తాగునీరు, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏఎస్ఎఫ్ విజ్ఞప్తి చేసింది. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కమిటీని కోరినట్లు గార్లపాటి శ్రీధర్ తెలిపారు.

## బంగారు తిరుచ్చుపై అభయమిచ్చిన అమ్మవారు



తిరుచానూరు, జూలై 31 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం ఆలయ బంగారు తిరుచ్చిపై ఊరేగారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఏ ఈ ఓ దేవరాజులు, అర్చకులు బాబు స్వామి, సూపర్నెంట్ ముని చెంగల్ రాయులు, మరియు విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## భగవద్గీత పోటీల్లో బంగారు పతకం



సూళ్లూరుపేట, జూలై 31 ప్రభాతవార్త: భగవద్గీత 18 అధ్యాయాలు 700 శ్లోకాలను పఠించి అందరిని అబ్బురపరిచిన సూళ్లూరుపేటకు చెందిన బాల మేధావి అయినావరపు విశ్వనాథ్ శ్రీ కృత్ అమెరికాలోని ప్రిస్కో టెక్సాస్ లోని దత్తపీఠం, కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గురు పౌర్ణిమ సందర్భంగా నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా ఈ చిన్నారి తన ప్రతిభను కనబరిచాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీశ్రీగణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదగా ఈ బంగారు పతకాన్ని అందుకున్నాడు. ఐదు సంవత్సరాల వయస్సులోనే ఇటువంటి ఘనత సాధించడం పట్ల సచ్చిదానంద స్వామి బాలమేధావిని ప్రశంసించి ఆశీర్వచనాలు అందజేశారు. శ్రీ కృత్ అమెరికాలో ఇంద్రకంటి వెంకట్ వద్ద భగవద్గీతను అభ్యసించాడు. చిన్నారి శ్రీకృత్ శ్రీహరికోటకు చెందిన ప్రముఖ త్రిభాష రచయిత, కళాకారుడు, అంతర్జాతీయ అవార్డుల గ్రహీత అయిన అయినాపురపు రామలింగేశ్వర రావు మనవడు శ్రీకృత్ తల్లిదండ్రులు అయినా శృతి, శరన్‌లు అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌లుగా పనిచేస్తున్నారు. శ్రీ కృత్ తండ్రి అంతరిక్ష కేంద్రీయ విద్యాలయం శ్రీహరికోట పూర్వపు విద్యార్థి శ్రీ కృత్ సాధించిన ఈ ఘనత పట్ల పలువురు రామలింగేశ్వర రావుకు అభినందనలు తెలిపారు.

## మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమం



బాలాయపల్లి, జూలై 31 ప్రభాతవార్త: పోలీస్ స్టేషన్ పరిధిలో ఈగల్ సీఐ జి. ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్ బాబుతో కలిసి పల్లె బాటలో ఈగల్ మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువత భవిష్యత్తుపై వాటి ప్రభావం, చట్టం ప్రకారం డ్రగ్స్‌కు సంబంధించిన నేరాలకు విధించే కఠిన శిక్షల గురించి వివరించారు.అలాగే, మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, నిల్వ లేదా గంజాయి సాగుకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి!

**-పోక్సో కేసు నమోదు**

పుత్తూరు, జూలై 31 ప్రభాతవార్త : మండలంలోని తడుకు పంచాయతీ పరిధిలోని మజ్జిగుంట ఎస్టీ కాలనీకి చెందిన ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై శుక్రవారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సిఐ నెట్టి కంఠయ్య తెలిపిన మేరకు ఎస్టీ కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలిక అదే ప్రాంతానికి చెందిన హరికృష్ణ (27) అనే వ్యక్తి తనపై పలుమార్లు లైంగిక దాడి చేసినట్టు దాంతో తాను గర్భం దాల్చినట్టు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తల్లితండ్రులతో కలిసి బాలిక తిరుపతికి చెందిన ఒక వ్యక్తి మామిడి తోటలో చిన్న చిన్న పనులు చేసుకుంటోందన్నారు. నిందితుడు పరిచయస్తుడు కావడం వల్ల ఆమెకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడినట్టు తెలిపారు. బాలికకు అవసరమైన వైద్య పరీక్షలు చేయించామని, కౌన్సిలింగ్ ఇచ్చి చట్టపరమైన సహాయం అందించే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కేసులో సాక్ష్యాధారాలను సేకరించి, చట్టప్రకారం నిందితుడిపై కఠిన చర్యలు చేపట్టేందుకు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

## టిటిడికి 10 టన్నుల కూరగాయలు వితరణ

పలమనేరు, జూలై 31 ప్రభాతవార్త: పలమనేరు మార్కెట్ యార్డు నుండి తిరుమల తిరుపతి దేవస్థానం వెంగమాంబ అన్నదాన సత్రానికి శుక్రవారం 10 టన్నుల కూరగాయలు విరాళంగా పంపారు. మున్సిపాల్టీ పరిధిలోని గంటావూరు బిసి కాలనీ గంగమ్మగుడి ఛైర్మన్ ప్రముఖ సంఘ సేవకుడు డా.మురుగన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సంచారజాతుల సంఘం అధ్యక్షుడు పూసల రవి, రైతు సంఘం నాయకులు ఈ కూరగాయలను వ్యాపారులు, రైతుల నుండి సేకరించారు. కూరగాయలు తరలించే వాహనానికి పూజలు చేసి గోవిందనామ స్మరణతో సాగ నంపారు. పలమనేరు మార్కెట్ యార్డు నుండి టిటిడి అన్నదాన సత్రానికి ప్రతినెలా కూరగాయలు విరాళంగా పంపడం ఆనవాయితీగా వస్తోంది. ఇది తమ పూర్వ జన్మ సుకృతమని ఆ తిరుమల వెంకటేశ్వరుడు తన సేవకు కల్పించిన అవకాశమని రైతులు చెపుతున్నారు.

**అమరరాజాలో...**

## మోడల్ యునైటెడ్ నేషన్స్ఎడిషన్స్-2




తవణంపల్లె, జూలై 31 ప్రభాతవార్త: మండలంలోని దిగువమాఘం అమరరాజా విద్యాలయంలో శుక్రవారం అమరరాజా మోడల్ యునైటెడ్ నేషన్స్ఎడిషన్స్-2 కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈకార్యమ్రాన్ని అమరరాజా గ్రూప్ హెడ్ హెచ్ఆర్,షేర్డ్ సర్వీసెస్ కె.నళినీకుమార్, రాజన్న ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ ఆర్.సతీష్‌లు ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈకార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన 11 సీబిఎస్ఈ పాఠశాలల నుండి 200 మంది విద్యార్థులు పాల్గొని వివిధ కమిటీ సమావేశాల్లో వివిధ దేశాల ప్రతినిధులుగా వ్యవహరించి ప్రపంచ వ్యాప్తంగా వున సమకాలీన సమస్యలపై చర్యలు, వాదోపవాదాలు నిర్వహించి తీర్మానాలను రూపొందించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ మోడల్ యునైటెడ్ నేషన్స్ఎడిషన్స్ కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు,విమర్శనార్మ ఆలోచనా విధానం, దౌత్య నైపుణ్యాలు, బృంద సహకార భావన, సమర్థవంతమైన సంభాషణా నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.జయశ్రీ మాట్లాడుతూ ఈకార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఈఅనుభవం తమలో బహిరంగ ప్రసంగ నైపుణ్యం, సమస్యల పరిష్కార సామర్థ్యం, అంతర్జాతీయ అంశాలపై అవగాహనను పెంపొందించిందని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గంధం అలంకరణలో కరుమారియమ్మ





తిరుపతి,జులై 31ప్రభాతవార్త: తిరుపతి తిలక్ రోడ్డులోని కరుమారియమ్మ దేవాలయంలో జరుగుతున్న ఆడి నెల మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ శుక్రవారం సందర్భంగా అమ్మవారు ప్రత్యేక గంధం అలంకరణలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, గంధం తో సుందరంగా అలంకరించారు. గంధపు సుగంధాలతో అలంకరించిన అమ్మవారి రూపాన్ని దర్శించేందుకు వందలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి అనుగ్రహాన్ని కోరుకున్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా పొంగలి సమర్పించి, నైవేద్యాలు అర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఆలయ పూజారి వేలాయుధం, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్, సభ్యులు సింగంశెట్టి సుబ్బరామయ్య, పొన్నాల జేజిరెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానందం, పేరియర్ స్వామి రామ్ కుమార్, తులసి రామ్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, మునినాధరెడ్డి, సుశీల, హరి కుమారి ఆలయ కమిటీ సభ్యులు బాలాజీ, మునిరాజా, వెంకట ముని, దేనా, గుణశేఖర్, మాధవ, వెంకటేశ్వర్లు ఆనంద, సుబ్రహ్మణ్యం, బాబు, రేవతి, ఉషారాణి, అల్లిరాణి, గాలం కాంచనమ్మ, కుమారి, గీతమ్మ, ప్రియాంక, ద్రాక్షాయని, ప్రతిభ పాల్గొన్నారు.

## బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడమే...

నిజమైన నాయకత్వం



తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త: తిరుపతి ఎంఆర్‌పల్లిలోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో విద్యార్థి నాయకుల నియామకాన్ని పురస్కరించుకుని ఇన్వెస్టిట్యూర్ వేడుకను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు, ఆర్ఐ వసంత్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందజేసి వారి బాధ్యతలను అధికారికంగా అప్పగించారు. అనంతరం విద్యార్థులు ప్రమాణ స్వీకారం చేసి నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో తమ విధులను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ, నాయకత్వం అనేది కేవలం ఒక హోదా కాదని, అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించే సామర్థ్యమే నిజమైన నాయకత్వమని అన్నారు. డీజీఎం కొండలరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మధుచంద్రుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని నూతన విద్యార్థి నాయకులను అభినందించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

## 200 మంది విద్యార్థులతో స్వచ్ఛతపై అవగాహన




తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ తిరుపతి అవగాహన ర్యాలీ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ ఎన్. సైదానాయక్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు స్వచ్ఛతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్. సైదా నాయక్ మాట్లాడుతూ పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. యువత సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని గ్రామాలు, పట్టణాల స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ బ్యూరో కోఆర్డినేటర్ ఆచార్య దామోదరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిధిలోని పలు అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 200 మంది విద్యార్థులు తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు కూడా పరిశుభ్రత పాటిస్తూ నగరాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు సహకరించాలని ఎన్ఎస్ఎస్ అధికారులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, పరిశోధక విద్యార్థులు, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టౌన్ క్లబ్ ఆర్థిక అవకతవకలపై విచారణ జరపాలి



తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త: తిరుపతి టౌన్ క్లబ్‌లో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న పరిపాలన, ఆర్థిక వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని క్లబ్ సభ్యులు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కోరారు. శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించిన సభ్యులు, క్లబ్‌లో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న ఆర్థిక అవకతవకలు, ఎన్నికల నిర్వహణలో జాప్యంపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సభ్యుల కథనం ప్రకారం, గత ఏడేళ్లుగా అడ్‌హాక్ కమిటీ క్లబ్ వ్యవహారాలను నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించకుండా కొనసాగుతోందని ఆరోపించారు. ఈ వ్యవధిలో క్లబ్ నిధుల వినియోగం, ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత లేకపోవడంతో పాటు పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. క్లబ్‌కు ఎంతో చరిత్ర, ప్రతిష్ఠ ఉన్నప్పటికీ ప్రస్తుత కమిటీ తీరుతో సంస్థ ప్రతిష్ఠ దెబ్బతింటోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. టౌన్ క్లబ్‌కు టీడీఆర్ బాండ్ల రూపంలో వచ్చిన నిధులు, లీజుల ద్వారా వచ్చిన ఆదాయంపై పూర్తి వివరాలు వెల్లడించడం లేదని సభ్యులు ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న లీజుదారులను నిబంధనలకు విరుద్ధంగా తొలగించి, కమీషన్ల కోసం కొత్త వారికి లీజులు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశాలపై వెంటనే స్వతంత్ర విచారణ కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సభ్యులు చేసిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అంశాలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఊకా విజయ్‌కుమార్, జెడబ్ల్యూ విజయ్‌కుమార్, ఆర్. రవీంద్ర, బత్తయ్య, చంద్రబాబు, మల్లిపూల బాలసుబ్రహ్మణ్యం తదితర టౌన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## నవోదయ 6వ తరగతి ప్రవేశాల గడువు పొడిగింపు

తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త:



జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027-28 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తుల సమర్పణ గడువును ఆగస్టు 7 వరకు పొడిగించినట్లు తిరుపతి విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్ర అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది కూడా అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలు, దరఖాస్తు విధానం, శిక్షణ కోసం 86888 88802, 93999 76999 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

## ఎస్వీ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ నియామకం

తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త:



తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఎస్. శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ ధ్వారకనాథ్‌రెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుతం కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. శ్రీనివాసులుకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించారు. డాక్టర్ శ్రీనివాసులు శనివారం ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ శ్రీనివాసులకు అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## సీబీఎస్ఈ అథ్లెటిక్స్‌లో...తిరుపతి విద్యార్థుల సత్తా!



తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్‌లో ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్-7 అథ్లెటిక్ మీట్‌లో తిరుపతికి చెందిన భారతీయ విద్యా భవన్ శ్రీ వేంకటేశ్వర విద్యాలయ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. 19 ఏళ్ల బాలుర విభాగంలో 12వ తరగతి విద్యార్థి బి. ప్రణీత్ కుమార్ షాట్‌పుట్, డిస్కస్ త్రో పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబర్చి రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. అదే తరగతికి చెందిన తనీష్ లాంగ్ జంప్‌లో రజత పతకం కైవసం చేసుకున్నాడు. అలాగే ఏడో తరగతి విద్యార్థి పి. కేశవ సంపత్ డిస్కస్ త్రో విభాగంలో కాంస్య పతకం సాధించి ప్రతిభ చాటాడు. ఈ సందర్భంగా విజేతలను భారతీయ విద్యా భవన్ గౌరవ సంచాలకులు, కోశాధికారి డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు, ప్రిన్సిపాల్ డి.పద్మజ, వైస్‌ప్రిన్సిపాల్ కె.పుణ్యవతి అభినందించారు. విద్యార్థులకు శిక్షణ అందించి ఈ విజయాలకు మార్గనిర్దేశం చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు పి. ప్రసాద్ సేవలను వారు ప్రశంసించారు.

## వర్షాకాల వ్యాధుల నివారణపై అప్రమత్తంగా ఉండాలి

– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి హెల్త్, జూలై 31 ప్రభాతవార్త: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందేలా అప్రమత్తంగా పనిచేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వైద్య సిబ్బందికి సూచించారు. తిరుపతి నగరంలోని నరసింహతీర్థం రోడ్డులో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వైద్య సేవలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. వైద్యులు సమయానికి పరీక్షలు నిర్వహిస్తున్నారని, అవసరమైన ఉచిత మందులు కూడా అందిస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం రోగుల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించిన ఆయన, ప్రతి వివరాన్ని క్రమబద్ధంగా నమోదు చేయాలని సూచించారు. నిత్యం 70 నుంచి 100 మంది వరకు ఈ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొందుతున్నట్లు వైద్యులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, వ్యాధి తీవ్రతను బట్టి ప్రభుత్వ ఆస్పత్రులకు రోగులను రిఫర్ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వర్షాకాల వ్యాధుల పట్ల ప్రత్యేక అప్రమత్తతతో పనిచేస్తున్నట్లు వివరించారు. ఆసుపత్రిలోని మందుల నిల్వలను ఎమ్మెల్యే పరిశీలించారు. అలాగే రక్తపరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ప్రయోగశాల, పది పడకల వార్డు, చికిత్స గదులను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేవని ఏఎన్ఎంలు, నర్సులు, ఇతర సిబ్బంది ఎమ్మెల్యేకు తెలిపారు. వైద్యం కోసం వచ్చే ప్రతి రోగిని మానవతా దృక్పథంతో ఆదరించాలని, పేదలు, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య రక్షణలో ఏఎన్ఎంలు, నర్సులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ బాలకృష్ణ నాయక్, వైద్యులు, ఏఎన్ఎంలు, నర్సింగ్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో టైల్స్ మేస్త్రీ మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



పాకాల (దామలచెరువు), జూలై 31 ప్రభాతవార్త: చిత్తూరు - పీలేరు జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషాద సంఘటన శుక్రవారం మధ్యాహ్నం పాకాల మండలం, దామలచెరువు పంచాయతీ బొబ్బవారిపల్లి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద చోటుచేసుకుంది. ఐరాల మండలం, పోలకల పంచాయతీ, రెడ్డివారిపల్లికి చెందిన కొమిరి విజయకుమార్ (30, తండ్రి: సుబ్రమణ్యం) టైల్స్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ప్రాంతంలో విజయకుమార్, తన వద్ద పనిచేసే ఎన్.కట్టకిందపల్లికి చెందిన ఎన్.విజయ్ కుమార్‌తో కలిసి పని నిమిత్తం పాటూరు నుండి దామలచెరువుకు ద్విచక్ర వాహనం (ఏపి 40ఎల్ఎల్ 1460)పై బయలుదేరారు. సరిగ్గా మధ్యాహ్నం సమయంలో బొబ్బవారిపల్లి పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే, పీలేరు వైపు నుండి చిత్తూరు వైపు అతివేగంగా వస్తున్న అశోక్ లేలాండ్ కంటైనర్ లారీ (టిఎన్ 31 సిజె 4458) ముందున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో రాంగ్ రూట్‌లోకి వచ్చి ఎదురుగా వస్తున్న వీరి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న కొమిరి విజయకుమార్ సహా వెనుక కూర్చున్న ఎన్.విజయ్ కుమార్‌లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఇద్దరినీ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కొమిరి విజయకుమార్ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వెల్లూరు సి.ఎం.సి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో తీవ్ర రక్తస్రావమై మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఎన్.విజయ్ కుమార్ ప్రస్తుతం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కంటైనర్ డ్రైవర్ అశోక్ కుమార్ (సి. మంగళం, విల్లుపురం జిల్లా, తమిళనాడు) నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. మృతుడు కొమిరి విజయకుమార్‌కు వివాహమై భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి ఆధారణగా ఉన్న వ్యక్తి కళ్లముందే అనంత లోకాలకు వెళ్లడంతో రెడ్డివారిపల్లి గ్రామంలో తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి. ఘటనపై పాకాల సర్కిల్ ఇన్స్పెక్టర్ చిన్న గోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్వీయూలో మైక్రోబయాలజీ భవనం ప్రారంభం

తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త:




ఎస్వీయూలో మైక్రోబయాలజీ విభాగానికి నూతనంగా నిర్మించిన అత్యాధునిక భవనాన్ని శుక్రవారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా భవనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి భవనాన్ని విద్యార్థులకు అంకితం చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి, మైక్రోబయాలజీ శాఖాధిపతి ఆచార్య బాలాజీ, విశ్వవిద్యాలయ ఇంజనీర్ తాండవకృష్ణతో పాటు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యా, పరిశోధన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రూ.1.02 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. మొత్తం 3,960 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ భవనంలో రెండు విశాలమైన తరగతి గదులు, రెండు ఆధునిక ప్రయోగశాలలు, అధ్యాపకుల కోసం ప్రత్యేక ఫ్యాకల్టీ హాల్, విద్యార్థులు, విద్యార్థినుల కోసం ప్రత్యేక శౌచాలయాలు ఏర్పాటు చేశారు. ప్రయోగాత్మక బోధన, పరిశోధన కార్యక్రమాలకు అవసరమైన మౌలిక వసతులను దృష్టిలో ఉంచుకుని భవనాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు మాట్లాడుతూ, నూతన భవనం అందుబాటులోకి రావడంతో మైక్రోబయాలజీ విభాగంలో విద్యార్థులు, పరిశోధకులకు మరింత అనుకూలమైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. శాఖాధిపతి ఆచార్య బాలాజీ మాట్లాడుతూ, ఈ నూతన భవనం ద్వారా మైక్రోబయాలజీ విభాగంలో బోధన, పరిశోధన, ప్రాజెక్టు కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ భవనం విద్యార్థుల విద్యా ప్రగతికి, అధ్యాపకుల పరిశోధనా కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.

## యూజీ సెకండ్ సెమిస్టర్...తొలి పరీక్ష వాయిదా




తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త: ఎస్వీయూ పరిధిలో శనివారం నుంచి ప్రారంభం కావాల్సిన యూజీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో తొలి రోజు నిర్వహించాల్సిన భాషా (లాంగ్వేజ్) పరీక్షను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్) డాక్టర్ రాజామాణిక్యం తెలిపారు. సాంకేతిక కారణాలతో హాల్‌టికెట్ల జారీ ప్రక్రియలో జాప్యం ఏర్పడటంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తొలి రోజు నిర్వహించాల్సిన భాషా పరీక్ష మాత్రమే వాయిదా పడిందని, మిగిలిన అన్ని పరీక్షలు ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే సోమవారం నుంచి యథావిధిగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా యూజీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టుల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులు ఇన్‌స్టంట్ పరీక్షలకు హాజరుకావాలంటే ఈ నెల 5వ తేదీలోపు నిర్దేశిత పరీక్ష ఫీజును చెల్లించాలని డాక్టర్ రాజామాణిక్యం సూచించారు. పరీక్షలకు సంబంధించిన తాజా సమాచారం కోసం విద్యార్థులు విశ్వవిద్యాలయం అధికారిక ప్రకటనలను గమనించాలని కోరారు.

## బొలెరో వాహనం ఢీకొని స్కూటరిస్టు మృతి

నాగలాపురం, జూలై 31 ప్రభాతవార్త:



నాగలాపురం పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన బొలెరో వాహనం స్కూటరిస్టుని ఢీకొని మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. నాగలాపురం నుంచి బొలెరో వాహనం పిచ్చాటూరు వైపు వెళుతుండగా ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న వ్యక్తి మదనంబేడు ఎస్టీ కాలనీకి చెందిన వెంకటేశులు(34) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బొలెరో వాహనం డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగలాపురం ఎస్ఐ సునీల్ తెలిపారు.

# తిరుపతి డివిజన్

## ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

–అభ్యంతరాల స్వీకరణకు గడువు ఆగస్టు 30

–నియోజకవర్గ ఎన్నికల అధికారి రామ్మోహన్



చంద్రగిరి, జూలై 31 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను శుక్రవారం నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్‌డిఓ రామ్మోహన్ విడుదల చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏఈఆర్‌ఓ, తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలను వెల్లడించారు. జూన్ 15 నుండి జూలై 24 వరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తిచేసి డిజిటలైజేషన్ చేయడం జరిగిందన్నారు. ముందుగానే నిర్ణయించిన మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, సవరణలకు ఆగస్టు 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ మేరకు వచ్చిన దరఖాస్తులను సెప్టెంబర్ 28 నాటికి పరిష్కరించి, అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం చంద్రగిరి నియోజకవర్గంలో 2,63,522 మంది ఓటర్లు వున్నట్లు తెలిపారు. ఇందులో 1,27,030 మంది పురుషులు, 1,36,465 మంది మహిళలు, 27 మంది థర్డ్ జెండర్స్ వున్నట్లు వివరించారు.

## శ్రీమూలస్థాన ఎల్లమ్మకు పొంగళ్ళు



చంద్రగిరి, జూలై 31 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారికి శుక్రవారం అక్కగార్ల కాలనీ ప్రజలు పొంగళ్ళు పెట్టుకున్నారు. గంగుడుపల్లి, చంద్రగిరి జమండ్లవీధి, ఆకుతోటవీధి, అక్కగార్ల కాలనీ వాసులు ఏడా దికి ఒకమారు అమ్మవారికి పొంగళ్ళు పెట్టుకుని మొక్కులు తీర్చుకోవడం సంప్రదాయంగా వస్తున్నది. ఇందులో భాగంగా వేకువజామున తలస్నానా లాచరించి, నూతన వస్త్రాలు ధరించి, పొంగళ్ళ బుట్టను సిద్ధం చేసుకున్నారు. భాణాసంఛా పేళుళ్ళు, బ్యాండుభాజాలతో కాలినడకన పొంగళ్ళ బుట్టలను మోసుకుని మహిళలు ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్ళను వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, దర్శనం చేసుకుని, అర్చకుల ఆశీస్సులతో తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

## హెల్మెట్ ధరించండి రక్షణ పొందండి : ఎస్ఐ



సత్యవేడు, జూలై 31 ప్రభాతవార్త: సత్యవేడు పరిధిలోని శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ పరిధి కొబాల్కొ సర్కిల్ వద్ద శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహిస్తూ ప్రమాదాల్లో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ద్విచక్రవాహన దారులకు శ్రీసిటీ ఎస్ఐ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. వాహన దారులకు ట్రాఫిక్ నిబంధనలతో పాటు అవసరమైన వాహన డాక్యుమెంట్స్, లైసెన్స్ కలిగి ఉండాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ స్పష్టం చేశారు. శ్రీసిటీ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఎస్ఐ తమ సిబ్బందితో ప్రయాణికులకు అవైరెనెస్ కార్యక్రమాన్ని కల్పిస్తూ హెల్మెట్ ధరించని ద్విచక్రవాహన దారులకు అపరాధ రుసుం విధిస్తూ ప్రయాణికులకు భద్రత నియమాల గురించి తెలియజేశారు. ప్రతి రోజు తమ తమ విధుల కోసం ఇంటి నుంచి బయటకు వస్తుంటారు. మన ఉద్యోగ పనుల నిమిత్తం జాగ్రత్తగా సురక్షితంగా తమ తమ గమ్యలకు చేరుకోవాలని రోడ్లపై అతివేగం ప్రమాదకరమని మన కోసం మన ఇంట్లో మన కుటుంబ సభ్యులు ఎదురు చూస్తుంటారని భద్రత నియమాలను పాటిస్తూ క్షేమంగా వెళ్లాలని సూచించారు.

## రెండేళ్లు నమ్మకం అభివృద్ధి బాబు లక్ష్యం

సత్యవేడు, జూలై 31 ప్రభాతవార్త:

సత్యవేడు పట్టణంలో 259,260 బూత్‌ల పరిధిలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండేళ్ళ నమ్మకం– అభివృద్ధి, సంక్షేమం ఇంటింటా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు మండల మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు తమ్ముళ్ల ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్ళలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను పంపిణీ చేసి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ క్లస్టర్ బాషా, క్లస్టర్ బాబుయాదవ్, శశినాయుడు, షణ్ముగం, కోనయ్య, బాల, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్షేమ విజయాలను ఇంటింటికి తీసుకెళుతున్న టీడీపీ నాయకులు



విజయపురం, జూలై 31 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం రెండేళ్ళలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీపీ లక్ష్మిపతి రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సూరికాపురం గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి రెండేళ్ళ పాలనలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళుతోందన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రమేష్‌రాజు, పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిభాస్కర్‌రాజు, స్థానిక పార్టీ నాయకులు మదన్ మోహన్‌రాజు, బాలాజీ, సుధాకర్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీహరిపురం పంచాయతీ కార్యదర్శి మృతి!

విజయపురం, జూలై 31 ప్రభాతవార్త:



మండలంలోని శ్రీహరిపురం పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ(45) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె తమిళనాడు రాష్ట్రం తిరుత్తణిలో నివాసం ఉంటూ రోజు శ్రీహరిపురంకు కనకమ్మసత్రం మీదుగా విధులకు హాజరయ్యేవారు. ఆమె మండలంలోని బూచివానత్తం, ఎం అగరం, కాళికాపురం, మల్లారెడ్డి కండ్రిగ, జీఎం పురం, ఇళ్ళత్తూరులో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఆమె మృతి పట్ల ఎంపీడీవో కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు నివాళులర్పించారు.

## కమనీయం పద్మావతీదేవి అమ్మవారి ఊంజల్‌సేవ



నారాయణవనం, జూలై 31 ప్రభాతవార్త : నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం అమ్మవారిని తిరుచ్చివాహనంపై అదిరోహించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## భీమునిచెరువులో పలు అభివృద్ధి పనులు

నారాయణవనం, జూలై 31 ప్రభాతవార్త :



మండలంలోని భీమునిచెరువులో దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న పలు పనులను చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్, సత్యవేడు నియోజకవర్గ టిడిపి బూత్ ఇంచార్జ్ కోనేటి సుమన్‌కుమార్ సహకారంతో శుక్రవారం చేపట్టారు. ప్రధానంగా నారాయణవనం హైవే నుంచి భీమునిచెరువు వరకు రోడ్డు ఇరువైపుల మొలచిన మొక్కలను, చెత్త కుప్పలను జెసిబి సాయంతో తొలగించారు. అలాగే భీమునిచెరువు సచివాలయం వద్ద ఇళ్ల పగలకొట్టిన కుప్పగా పోసిన మట్టిని చదరం చేయించారు. అలాగే వైకి అమావాస్య కుమారుడు వి.గోవిందరాజులు అమల ఇంటి వెనుక వైపు పెద్ద కాలువలో పేరుకుపోయిన మురికిని జెసిబి సాయంతో సుమారు 500 మీటర్ వరకు తొలగించి సమస్యను పరిష్కరించారు. దీంతో మురికికాలువలో నీళ్ల నిలవడం జరగదని ప్రజలు అభినందించారు. త్వరలో నారాయణవనం రోడ్డు నుంచి భీమునిచెరువు గ్రామంలో వెలగని వీధి దీపాలను రెండు రోజుల్లో వేస్తామని తెలిపారు. దీంతో చీకటి సమస్య ప్రజలకు తొలగనుంది

1 CTR 6:1 CTR 6.qxd 7/31/2026 11:04 PM Page 1



## పోలిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

శ్రీకాళహస్తి రూరల్, జూలై 31 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోలిరెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. శుక్రవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.

## ముగ్గురు డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు

శ్రీకాళహస్తి, జులై 31 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి ఎపియస్ ఆర్‌టిసిలోపని చేసే డ్రైవర్ల పనితీరు జవాబుదారి తనంతో కూడుకున్నదని శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రశంసా పత్రాల అందజేత కార్యక్రమాల్లో పలువురు వక్తలు అన్నారు. డిపో మేనేజర్ రేవతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు వన్ టౌన్ సీఐ సి.వెంకటేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి శ్రీకాళహస్తి డిపో సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ నాకు మొట్టమొదటిసారిగా శ్రీకాళహస్తి ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడే అవకాశం కల్పించినందుకు చాలా సంతోషంగా ఉన్నదని తెలిపారు. ఈ సందర్భంగా డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని సెల్ఫోన్ డ్రైవింగ్ చేయరాదన్నారు. శ్రీకాళహస్తి డిపోలో 29 సంవత్సరాలుగా ప్రమాద రహిత డ్రైవర్లుగా జె.అమీర్, జి.వి. సుబ్బయ్య, టి.ఎం. ఆచారిలకు ప్రశంసా పత్రంలను అందజేసినారు వారిని అభినందించినారు. డిపో మేనేజర్ ఎం. రేవతి మాట్లాడుతూ పై ముగ్గురుని ఆదర్శంగా తీసుకొని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రమాద రహిత డిపోగా శ్రీకాళహస్తి డిపో ను తీసుకురావాలని తెలియజేసినారు. అసిస్టెంట్ ఇంజనీర్ ఏ.చక్రవర్తి, సూపర్డెంట్ పి.సుబ్బారావు, ఎం.మారయ్య యూనియన్ నాయకులు మరియు సిబ్బంది పాల్గొనినారు.

## విద్యాభివృద్ధికి ధాతల సహకారం కావాలి: గిరిధర్ రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్,జూలై 31 ప్రభాతవార్త:



విద్యార్థుల అభివృద్ధికి ధాతలు సహకరించాలని చిందేపల్లి సిద్దేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు గంగలపూడి గిరిధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధ్యాత్మిక అవధూత 11వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు డైరీలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, టీటీడీ మాజీ సభ్యులు పోతుల రాజకుమార్,ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'సొంత నిధులతో చికిత్స చేయిస్తా : ఎంఎల్ఏ

తొట్టంబేడు జూలై 31 ప్రభాతవార్త:



ఇంటింటికి మీ సుధీరన్న కార్యక్రమం లో భాగంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి దివ్యాంగురాలి ఆవేదనకు స్పందించి మానవత్వం చాటుకున్నారు. తొట్టంబేడు మండలం, పిల్లమేడు పంచాయతీ, మామిడిగుంట దళితవాడలో పర్యటించిన ఎమ్మెల్యే అక్కడి నివాసి తులసి అనే దివ్యాంగురాలిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి స్వయంగా తెలుసుకున్నారు. సరైన వైద్యం అందితే తులసి నడిచే అవకాశం ఉందని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే చెన్నై అపోలో ఆసుపత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లిన వెంటనే పూర్తి సహకారం అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చికిత్స ఖర్చును తన సొంత నిధులతో భరిస్తానన్నారు. ఎమ్మెల్యే తక్షణ స్పందనతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## చిట్టతూరులో పొంగళ్ళు

తొట్టంబేడు,జూలై 31 ప్రభాతవార్త:



తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు గ్రామంలో శుక్రవారం వైభవంగా పోలేరమ్మ పొంగళ్ళను నిర్వహించారు. ఉదయం నుంచి పోలేరమ్మ ఆలయం వద్ద గ్రామస్తులు,మహిళలు విశేషంగా పాలపొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి తమ పార్టీ నాయకుడు బాలాజిరెడ్డి ఆహ్వానం అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు జరుపుకున్నారు. అక్కడ గ్రామస్తులు ఆలయ మర్యాదలతో ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డికి మేళ తాళాలు,తప్పెట్ల మోతతో స్వాగతం పలికారు. ఎంఎల్ఏ తో పాటు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు షఫీ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు,జూలై 31 ప్రభాతవార్త:



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని శుక్రవారం ప్రముఖ బ్యాట్మెంటన్ క్రీడాకారిణి శ్రీమతి పీవీ సింధు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ సూపర్డెంట్ ముని చెంగలరాయలు మరియు విజిలెన్స్ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కుప్పం, జూలై 31 ప్రభాతవార్త:

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సిఐ మల్లేష్ యాదవ్ సూచించారు. శుక్రవారం పల్లెబాటలో ఈగల్ టీం కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధి వడ్డిపల్లి, టిబి రోడ్‌లో నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించి 1972టోల్‌ఫ్రీనెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే డ్రగ్ టెస్ట్ కిట్లు, యూరిన్ టెస్ట్‌ల గురించి, ఎన్‌టిపిఎస్ యాక్ట్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఈగల్ బృందం కుమార్, శివ పాల్గొనా న్నరు.

## మహిళల రక్షణ మా బాధ్యత

– సిఐ మల్లేష్ యాదవ్

కుప్పం, జూలై 31ప్రభాతవార్త :



జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, డిఎస్పీ పార్థసారథి ఆదేశాలతో మహిళల రక్షణకే ధైర్య స్పర్శ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం పైపాళ్యం గ్రామంలో ధైర్య స్పర్శ, మీ భద్రత – మాబాధ్యత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికల రక్షణ, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు, ఆన్‌లైన్ మోసాలు, పోక్సో చట్ట ం తదితరాలపై సిఐ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్సై బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ - కమీషనర్

కుప్పం, జూలై 31 ప్రభాతవార్త:



వాతావరణంలో మార్పుల దృష్ట్యా కుప్పం మున్సిపాలిటీలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టినట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణకు మలాధియాన్, బ్లీచింగ్ స్ప్రే చేయించినట్లు తెలిపారు. మిగతా చోట్ల కూడా ఈ కార్యక్రమం చేపడ్తామన్నారు. ప్రజలు కూడా రోడ్లపై చెత్తపడేయరాదన్నారు. మున్సిపల్ పరిధిలో కాలువలను ఎప్పటికప్పుడు కార్మికులతో శుభ్రం చేయిస్తున్నట్లు కమీషనర్ తెలిపారు. దోమల సంతతి పెరగకుండా చర్యలు చేపట్టామన్నారు.

## ఆలయాభివృద్ధికి సహకరించండి!

ఏర్పేడు,జూలై 31 ప్రభాతవార్త:



ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వ రాలయంలో చేపట్టిన ప్రగతి పనులు,మాస్టర్ ప్లాన్‌లో భాగస్వాములు కావాలని శుక్రవారం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ఆలయ చైర్మెన్ బత్తల గిరి నాయుడు కోరారు. ఇఫ్కో చైర్మెన్ దిలీప్ సింఘానీ,ఇఫ్కో ఎండి కే.జి.ఎస్ పటేల్‌లను విమానాశ్రయంలో కలసి పరశురామేశ్వరుని ఆలయ చరిత్రను తెలిపే సమాచారం పుస్తకాన్ని అందించారు. ఈ సందర్భంగా వారితో పాటు నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.వారు శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఇతోధిక సహాయాన్ని అందించారు. ఉత్సవ వాహనాలను బంగారుతాపటం చేయించారు. ప్రస్తుతం పరశురామేశ్వ రాలయంలో జరుగుతున్న మాస్టర్ ప్లాన్‌లో భాగస్వాములు కావాలనికోరారు. ఇక్కడ నిర్మించే అతిథి గృహాలలో భాగస్వాములు కావాలని కోరారు.ఒకసారి ఆలయానికి వచ్చి పరిశీలించాలని కోరగా వారుసుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

## శివయ్య సేవలో ఇఫ్కోచైర్మెన్

శ్రీకాళహస్తి,జూలై 31 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఇఫ్కో చైర్మెన్ దిలీప్ సంఘాని వారి బృందంతోపూజలు జరిపించుకు న్నారు. వారు ఆలయానికి రాగా దక్షిణ గోపురం వద్ద వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులతో ఆలయ ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌బాబు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌రెడ్డి అందించారు.

## నక్కల కాలువ వంతెన ప్రమాదకరం

శ్రీకాళహస్తి,జూలై 31 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి పట్టణంలోని పానగల్‌లో గల నక్కల కాలువ వంతెన మలుపు ప్రమాదకరంగా మారిందని అక్కడ ఏదో ప్రమాదం జరిగే వరకు స్పందించరా? అని కాంగ్రెస్ నాయకులుమున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు ఆరు నెలల నుంచి ఈ వంతెన ప్రమాదపు టంచున ఉందని ఫిర్యాదులు చేస్తుంటే అధికారులు ఎ ందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. ఈ రోడ్డు ఆర్‌అండ్‌బికి సంబంధించినదని, అయితే పానగల్ నుంచి మున్సిపాలిటి మురుగునీటి కాలువ నిర్మించారని దాంతో రిటైనింగ్ వాల్ కుంగిందని వివరించారు.ఇక వర్షాకాలం నక్కల కాలువ ఉధృతంగా పారుతుంది.దాంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ స్పందించి ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలించి ప్రమాదాలను నివారించాలని కాంగ్రెస్ పార్టీ వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, సురేంద్ర, రాహుల్‌రాయల్, ఆంటోని, నాగూరయ్య, మునికృష్ణయ్య, చందు, నాగరాజు,అరుణ్, చరణ్, జోసెఫ్,సారధి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పేటలో ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఏర్పేడు,జూలై 31 ప్రభాతవార్త:



ఏర్పేడు మండలం పాపానాయుడు పేటలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం వార్సికోత్సవ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు.పేట అర్జున్‌బాబు పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు.ఆలయం ఎదురుగా ధ్వజ స్థంభంపై పసుపు జెండాను ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించామని అర్జున్‌బాబు తెలిపారు. 10రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో చివరి మూడు రోజులు ప్రాధాన ఉత్సవాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమాలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పండగ అని అగ్నిగుండానికి భక్తులు విశేషంగా తరలివస్తారని ఇందుకు తగ్గట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## జగన్‌కు మహిళలంటే చులకన : దేశం ధ్వజం

శ్రీకాళహస్తి,జూలై 31 ప్రభాతవార్త:



ఐదేళ్ళ పాటు రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా పరిపాలించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళలంటే చులకన భావమని శుక్రవారం తెలుగుదేశం నాయకులు అన్నారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్‌రెడ్డికి మహిళా లోకం అంటే చులకన అని విమర్శించారు. ఉన్మాదానికి బ్రాండ్ అంబాసిడర్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. జగన్‌రెడ్డి శ్రీకాకుళం పర్యటనలో రెచ్చిపోయి అడుగడుగునా శాంతి భద్రతలకు విఘాతం కలిగించటమే కాకుండా విధుల్లో ఉన్న మహిళా ఎస్ఐపై ఆముదాల వలస వైసిపి ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ మరి కొందరు ఉన్మాదులు అత్యంత హేయమైన రీతిలో దారుణంగా ప్రవర్తించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో గుమ్మడి దశరధాచ్చారి. మిన్నల్‌రవి,యం ఉమేష్‌రావు బీమాల భాస్కర్‌ముదిరాజ్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్ చిల్లకూరుమణి, గంగనపల్లి రమేస్, సులేమాన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బతుకులకు ఆధారమైన చెరువును కాపాడండి

### –కంచనపల్లి చెరువు కట్టను తెగ్గొట్టిన ఘటనతో రైతుల ఆగ్రహం

తొట్టంబేడు, జూలై 31 ప్రభాతవార్త:



వందలాది ఎకరాలకు సాగునీరందించే కంచనపల్లి చెరువు ప్రస్తుతం ప్రమాదంలో ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ వ్యక్తి స్వార్థ ప్రయోజనాల కోసం చెరువు కట్టనే తెగ్గొట్టడంతో గ్రామంలోని రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. బోనుపల్లికి చెందిన ఓ వ్యక్తి తన పొలానికి వెళ్లడానికి సరైన దారి లేదని, జెసిబిల సాయంతో కంచనపల్లి చెరువు కట్టపై అడ్డదారి వేసుకున్నాడన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎంతోమంది అన్నదాతలకు జీవనాధారంగా నిలిచిన చెరువు, ఇప్పుడు ఆ ఒక్కరి నిర్లక్ష్యం వల్ల నీరు నిలవకుండా పోయే స్థితికి చేరుకుందన్నారు. వర్షం పడిన వెంటనే నీరంతా తెగిన కట్ట గుండా వృథాగా వెళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. కంచనపల్లి చెరువు ఆయకట్టు కింద పలు గ్రామాల రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే స్పందించి ధ్వంసమైన చెరువు కట్టను యథావిధిగా పునర్నిర్మించాలని కంచనపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చెరువు చుట్టూ రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## ప్రజలకు అండ కూటమి ప్రభుత్వం

ఏర్పేడు, జూలై 31 ప్రభాతవార్త:



కూటమి ప్రభుత్వం... అధికారంలోకి వచ్చి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి లోకేష్ సారధ్యంలో ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఏర్పేడు మండలం ఏర్పేడు పట్టణంలో నిర్వహించిన ప్రచారంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్, రెడ్డివారి గురవారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన వెంట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణవేణి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మునేయ్య, పార్టీ నాయకులు సదా శంకర్ నాయుడు, నారాయణశెట్టి తదితరులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై వివరించారు. పభుత్వంపై ఉన్న సంతృప్తిని ప్రజలు వ్యక్తం చేసినట్లు నాయకులు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## సామాజిక న్యాయం పాటించాలి

తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త:



ఎస్వీయూలో కీలక పరిపాలనా పదవుల భర్తీలో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం కల్పించాలని, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) వర్గాలకు చెందిన అర్హులైన అధ్యాపకులకు సముచిత అవకాశం ఇవ్వాలని టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్ప నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.శ ుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థగా గుర్తింపు పొందిన ఎస్వీయూలో అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. 2014–2019 మధ్య తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఉపకులపతిగా ఆచార్య దామోదరంకు అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అధ్యాపకులకు కీలక పరిపాలనా పదవుల్లో తగిన ప్రాతినిధ్యం దక్కలేదని పేర్కొన్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్నప్పటికీ విశ్వవిద్యాలయంలోని ప్రధాన పరిపాలనా పదవుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రాతినిధ్యం లేకపోవడం విచారకరమని అన్నారు. త్వరలో ఖాళీ కానున్న రెక్టార్ పదవిని అకాడమిక్, పరిశోధన రంగాల్లో విశేష అనుభవం, అర్హత కలిగిన ఎస్సీ లేదా ఎస్టీ వర్గానికి చెందిన అధ్యాపకుడికి కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## నిందితునికి నాలుగు రోజులు సామాజిక సేవా శిక్ష

రేణిగుంట, జూలై 31 ప్రభాతవార్త:



రేణిగుంట జామ్ జామ్ హోటల్ వద్ద మద్యం సేవించి వాహనం నడిపిన అశోక్ నాయక్ (26)కు బహిరంగ న్యాయస్థానం రెండవ స్పెషల్ జ్యుడీషియల్ న్యాయమూర్తి పదివేల రూపాయల జరిమానా, నాలుగు రోజులు సామాజిక సేవ చేయవలసిందిగా తీర్పు ఇచ్చారని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ నిర్వహించే కాలంలో అర్బన్ పోలీస్ స్టేషన్ స్టేషన్ ఆఫీసర్ చెప్పిన సేవా కార్యకలాపాలు నిర్వహించాలని తీర్పులో పేర్కొన్నారన్నారు. స్టేషన్ ఆఫీసర్ ఆదేశించిన విధంగా సేవ చేయకపోయినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

## శ్రీ గంగమ్మ తల్లి జాతరకు ఏర్పాట్లు : సోలా మల్లికార్జున్

రేణిగుంట, జూలై 31 ప్రభాతవార్త :



రేణిగుంటలో కొలువుతీరిన శ్రీ గంగమ్మ తల్లి జాతరకు అందరూ సహకరించాలని, ఆలయ శాశ్వత ధర్మకర్త, గుడి చైర్మన్ పోలా మల్లికార్జున్ రెడ్డి అన్నారు. రేణిగుంట శ్రీ గంగమ్మగుడి ప్రాంగణంలో శుక్రవారం గుడి కమిటీ సభ్యులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడి చైర్మన్ ఆలయ శాశ్వత ధర్మకర్త సోలా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఆగస్టు నెల 11వ తేదీ జాతర మహోత్సవాలకు చాటింపు వేస్తున్నామని తెలిపారు. ఆగస్టు నెల 17వ తేదీ నుండి 19వ తేదీ వరకు మూడు రోజులు జాతర జరుగుతుందని అన్నారు. ఆగస్టు 17వ తేదీ గరిగ ఊరేగింపు, 18వ తేదీ అమ్మవారికి అంబళ్ల పొంగళ్ల సమర్పణ ఉంటుందన్నారు. 18వ తేదీ నడివీధి గంగమ్మ శూలం వద్ద శ్రీ గంగమ్మ తల్లి విశ్వరూప ప్రతిమను ప్రతిష్ఠించి అమ్మవారికి మహా కుంభాన్ని సమర్పించి అనంతరం రాత్రి అమ్మవారి ప్రతిమను జల్దిలో కలుపుతామని తెలిపారు. అమ్మవారి జాతరకు అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, జ్యోతి నారాయణ, ఉమేష్, వి ఆర్ రావణన్, లక్ష్మణ్ రెడ్డి, కన్నన్ రెడ్డి, ఎంజి రెడ్డి, రేణు స్వామి, రాజా స్వామి, విశాల్, పూల భాస్కర్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు..

## అంగన్‌వాడీ భవనం పూర్తి చేసాం: ఎంఎల్ఏ

తొట్టంబేడు, జూలై 31 ప్రభాతవార్త:



వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో అర్థాంతరంగా నిలిచిపోయిన కొణత నేరి గాంధీ సెంటర్ అంగన్వాడీ భవనం పూర్తయింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర మాజీ కార్యదర్శి గాలి చలపతి నాయుడు మాట్లాడుతూ చిన్నారులు ఏళ్ల తరబడి చెట్ల కింద, అద్దె భవనాల్లో ఇబ్బంది పడ్డ దుస్థితికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శుక్రవారం శాశ్వత పరిష్కారం చూపారన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన భవనాన్ని ఘనంగా ప్రారంభించటం సంతోషంగా ఉందని చలపతి నాయుడు వివరించారు. భవన నిర్మాణం నిలిచిపోయిన విషయాన్ని తాను, గాలి మురళి నాయుడు ఎంఎల్ఏ, ప్రస్తుత మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజనాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రజల ఇబ్బందులు తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి మండల గ్రాండ్ నిధుల నుండి రూ. 5 లక్షలు మంజూరు చేయించి, పెండింగ్ పనులను పూర్తి చేయించారని చలపతి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజ నాయుడు, లెక్కల మురళి నాయుడు, కమలాకర్, చెన్ను రాఘవులు యాదవ్, ఎంపీడీఓ సురేంద్రనాథ్, డిప్యూటీ ఎంపీడీవో గిరిధర్ భార్గవ సత్యం, కొర్రపాటి వాసు నాయుడు, కమలాకర్, మహిళ మండల అధ్యక్షురాలు రమాదేవి, వ్యవసాయ అధికారి సురేంద్ర రెడ్డి, వెలుగు సిసి నరసింహులు, సీడీపీఓ శాంతి దుర్గ, ఏఈ ప్రీతితో పాటు గౌరీ జోషి, కళ్యాణి మాజీ జడ్పిటిసి వెంకటాచలం, మాజీ సర్పంచులు గాలి బాలాజీ నాయుడు, కర్ణం హరిబాబు నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు.

## సిరి సంపదలు గౌరవాన్ని ఇవ్వవు : రేహాన్

శ్రీకాళహస్తి,జూలై 31 ప్రబాతవార్త:



సిరి సంపదలు మనిషికి గౌరవాన్ని ఇవ్వవని,అల్లాహ్ ఆదేశాల మేరకు మనం నడుచుకుంటే గౌరవం లభిస్తుందని హాఫీజేఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు.శుక్రవారం జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా మాట్లాడుతూ నేడు సమాజంలో మనం గొప్ప, ప్రతి ఒక్కరు తమను గుర్తించాలని,తమ మాట వినాలని కోరుకుంటారన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు తమ గౌరవాన్ని ప్రదర్శించుటకు ప్రయత్నిస్తారన్నారు. ఇది సరైన విధానం కాదన్నారు. మనం జీవిత రహస్యం తెలుసుకోకుండా గౌరవం కోసం ప్రాకులాడుతున్నారని ఇదిస రైనది కాదన్నారు. మనం ఇహలోకంలో గుర్తింపు కోసం ప్రాకులాడుతున్నామని కాని ఈ జీవితం శాశ్వతం కాదన్నారు. మనకు అల్లాహ్ ఇచ్చే గౌరవంతో స్వర్గస్తులౌతామన్నారు.దాని కోసం మన కృషి చేయాలన్నారు. ముఖ్యంగా మనలో ఇతరులను గౌవరించే గుణం అలవడాలన్నారు. అలాగే మనకు చెడ్డ చేసిన వారిని కూడా క్షమించే గుణం ముఖ్యమన్నారు. ఇరుగుపొరుగు వారికి సాయపడాలనే అలవాటు చేసుకోవాల న్నారు. ముఖ్యంగా క్షమాగుణం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరు సమాజంలో ప్రశాం తంగా ఉండాలంటే ఓర్పు సహానం ఎంతో అవసరమని దీనిని అలవాటు చేసుకోవాలని సూచించారు.

## నిరుపేదలపై దేవస్థానం అధికారుల తీరు సరికాదు: అంజూరు

శ్రీకాళహస్తి,జూలై 31 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు బ్యూటిఫికేషన్ పేర నిరుపేదల కడుపులు కొట్టడం సరికాదని మాజీ ధర్మకర్తల మం డలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివా సులు అన్నారు. శుక్రవారం దేవస్థానం అదికారులు ఒకటవ గోపురం(బిక్షాల గాలిగోపురం) వద్ద బ్యూటిఫికేష్ చేయటం మంచిదే కానీ ఈముసుగులో నిరుపేదల బతుకులను చిదిమివేయటం,వారిని నిరాశ్రయుల్ని చేయటం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. బ్యూటిఫికేషనా? నిరుపేదల జీవితాలు ముఖ్యమా అని ప్రశ్నించారు. ఆలయా ధికారులు రోజుకొక కొత్త వివాదంతో ఆలయప్రతిష్టను దిగజార్చు తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అమ్మవారి ఆలయంలో భక్తులకు సుదర్శం కల్పించలేని అధికారులు నిరుపేదలపై తమ ప్రతాపం చూపటం దారుణం అన్నారు. దశాబ్దాలుగా దేవుని సన్నిధి వద్ద బతుకు జీవనం కోసం చిరువ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని శ్రీనివాసులు తెలిపారు.ఇక్కడ సుమారు 10కుటుంబాలు పూలు,పండ్లు, కొబ్బరి కాయలు అమ్ముకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటూ పిల్లలను చదివించు కుంటున్నారని వారిపై తమ ప్రతాపం చూపటం తగదన్నారు. ఈ అంశంకు సంబంధించి అంజూరు తారక శ్రీనివాసులు చరవాణి ద్వారా ఇఓ వెంకటేశులుతో చర్చించారు. అక్కడ వ్యాపారాలు చేసుకోవటానికి అనుమతిస్తామని భరోసా ఇచ్చినట్లు అందుకు ఇఓకు ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు మునికృష్ణారెడ్డి,ప్రసాద్,సుధీర్‌లు పాల్గొన్నారు.వ్యాపారులు వారి బాధలను మాజీ చైర్మెన్‌కు వివరించారు.